విలువ

తాసల నాగభూషణం

మేడ గుడిసెని వెక్కిరిస్తుంది. అందులో ఆశ్చర్యమేం లేదు. ఉన్నవాడు లేనివాణ్ణి చులకనగా చూస్తాడు అది నేడే మనకి కొత్త కాదు. కాని పూరిపాకలో పేదరికంతో బ్రతుకుతోన్న నా సానుభూతికి గురయినవాళ్లు కూడా మా ఇంటిని మా పక్కనున్న మేడలతో పోల్చిచూసి, నన్ను మా ఇరుగుపొరుగు కుబేర పుత్రులతో బేరీజువేసి తేలిక చేస్తారంటే నాకు ఆశ్చర్యం కలగడమే కాదు — మనస్సు కూడా కలుక్కుమంది లోపలెక్కడో.

ఆరోజున ఫ్యాక్టరీకి సెలవయితే ఉదయం ఆరేడుగంటల వేళ ఆ వారం రోజుల శ్రమా తీరిపోయేట్టు తలారా స్నానం చేద్దామని బట్టలు విప్పవదేసి కేవలం డ్రాయరుతో, నూనె గిన్నె ముందుంచుకుని పీట వాల్చుకుని కూచున్నాను ఇంట్లో. అరచేతి నిండుగా నూనెని వొంపుకుని ఆ నూనెతో నడినెత్తిని తడిపి మెత్తగా తట్టుకుంటున్నాను. అప్పుడే మా వీధి చివరలో ఓ వేపునించి సన్నాయి స్వరం వినబడితే ఇంట్లోంచి మా నానిగాడూ, బుజ్జీ ఇద్దరూ బిలబిలమంటూ పరుగెత్తేరు వెలుపలికి.

కొంతసేపు సన్నాయిస్వరం వినబడడం, అది అటు ఆగగానే ఏదో సంతోషం పట్టలేనట్టు పిల్లలందరూ మూకుమ్మడిగా చప్పట్లు చరచడం— నా ధ్యాస అటువేపు మళ్లడానికి కారణాలయ్యేయి

ఎవరో గంగిరెద్దుల ఆటగాళ్లు నడివీధిలో నోళ్ళులేని ఆ గంగిరెద్దుల్ని సైతం తమ సన్నాయి స్వరం చేత తలలూపింపజేస్తున్నారనీ, వాటిచేత కవాతు చేయిస్తున్నారనీ నేమూహించగలిగేను.

పెద్ద పెద్ద అంగళ్ళలో అద్దాల షోకేసుల్లో అమర్చబడి అందగత్తెలయిన సేల్స్ గాల్స్ చేతుల్లోంచి ఖరీదుగా వచ్చే వస్తువే పుట్‌పాత్‌ల మీద కారుచవగ్గా దొరకడం మనకి తెలుసు. అంటే మనుషుల విలువే కాదు — ఓ వస్తువు తాలూకు విలువ కూడా స్థానబలిమిని బట్టి మారితీరుతుందన్నమాట. అల్లాగే స్థానాన్నిబట్టే కళకి కూడా విలువల్లో మార్పులు రావడం నిజంగా శోచనీయం. అయినా అది అనివార్యం.

కాకుంటే ఆనాటి ఆ గంగిరెద్దుల ఆటగాళ్ళ సన్నాయివాద్య సంగీతాన్నే ఏ పెళ్లిళ్ళలోనో, పేరంటాళ్ళలోనో ఏర్పాటు చెయ్యదల్చుకుంటే ఎవరయినా ఎన్ని వందలిచ్చుకోవలసొచ్చేదో! అంత బావుంది ఆ సన్నాయివాద్యం!

దాన్ని వింటూ నా తలంటు పూర్తి చేసుకునేసరికి మా నానిగాడూ, బుజ్జీ వీధిలోకి వెళ్లినంత విసురుగానూ వచ్చేరు ఇంట్లోకి.

నూనె రాసుకున్న నా ఒంటినిసైతం ఖాతరు చెయ్యక నన్ను తాకి నిలబడుతూ అన్నాడు నానిగాడు "నానా!... నానా! ఆ గంగిరెద్దులేమో... అతను పాడిన పాటకి ... ఎంత బాగా ఆడేయను కున్నావ్ – తలూపుతూ. మరేమో వాళ్ళు ... ఆ ఎద్దుల్ని తీసుకుని ... వొస్తున్నారు ప్రతి ఇంటికీ మనకి తోచింది ఇవ్వొచ్చు వాళ్ళకి." పరుగెత్తుకొచ్చినందువల్ల కలిగిన అలసటలో ఓ వంక వగరుస్తూనే తను చెప్పదల్చుకున్న మాటన్నీ చెప్పేడు వాడు.

వాడటు ముగించగానే అందుకుంది మా బుజ్జి "నానా! మనం గనక బట్టలిస్తే రంగులు రంగులుగా వాటినన్నింటినీ కలిపికుట్టి ఇంతలావున కప్పతారు వాటి మూపురాలమీద. ఎంచక్కా వుంటాయో తెలుసా అవి యెత్తుగా. మనమ్మూ అమ్మనడిగి ఓ చీర ఇద్దాం." ఇల్లా అంటూనే చివరి మాటని సగం తన నోట్లో వుంచుకునే వాళ్ళమ్మకోసం పెరట్లోకి పరుగు తీసింది బుజ్జి.

నేనూ ఆ ఉదయాన అంత సరసం సంగీతాన్ని అందించిన ఆ అజ్ఞాత కళాకారులకి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకుంటూ నాకున్నంతలో ఏదో ఇంత సాయం చేద్దామనే ఉద్దేశంతోనే వున్నాను. పైపెచ్చు మా పిల్లల మెప్పుకోలు మాటలకి మరింత ముచ్చటపడి వాళ్ళనీ సంతృప్తిపరచాలని అన్నాను నానిగాడితో "నానీ! నా ప్యాంటు జేబులో ఎంతుందో చిల్లర– చూడు!"

నేనా మాటనడం తరువాయి ఒక్క వూపున వెళ్లి గోడకున్న కొంకికి తగిలించిన నా కాకి యూనిఫాం ప్యాంటు జేబుల్ని కెలికి చిల్లరని చేతినిండుగా తీసుకొచ్చేడు నాని. నా పక్కనే కూచుని నేలమీద కుప్పగా గుమ్మరించేడు. ప్రశ్నార్థకంగా నావేపు చూసేడు.

"నానీ! ఎంతిద్దాం మనం వాళ్ళకి?" నేనడిగేను వాణ్ణి వాని చూపులోని ప్రశ్నని అర్థంచేసుకుని.

"ఓ రూపాయి" చిల్లర లెక్కెడుతూ కుడిచేతి చూపుడువేలుని మీదికెత్తి అన్నాడు నానిగాడు మురిపెంగా.

ఇంతలో మా విశాలాక్షి చేతిని పట్టుకుని లాక్కొచ్చే రీతిలో లోపల కొచ్చింది బుజ్జి.

"ఏమిటండీ! చీరేదో ఇమ్మన్నారుట." లోపలికొస్తూనే అడిగింది విశాల.

"ఇమ్మని నేననలేదే విశాలా! నీ కూతురే అంది ఇద్దామని ఏదైనా వుంటే ఓ చీరివ్వు — పాతదిగా చూసి."

"ఉన్నవన్నీ పాతవే అయితే ఇక వేరుగా చూడ్డం యెందుకులెండి!" నా పురమాయింపుకి మా ఆవిడ ఇచ్చిన సమాధానం అది.

అంతకు వారంరోజుల క్రితమే వాయిదాల పద్ధతి కింద చీరలిచ్చే ఓ ఆసామి దగ్గర తను కోరిన చీరని తీసివ్వలేదని రెండు మూడు రోజుల వరకూ మా ఆవిడ అలకపాన్పు వేసిన సంగతి గుర్తుకొచ్చింది నాకు ఆ మాటతో అయినా ఏం చెయ్యను? కష్టాన్ని కరెన్సీ కింద మార్చుకుని, నవ్వు వెనక ఇంత ఏడుపునీ దాచుకుని అణాపైసల లెక్కలతో జీవితాన్ని వెళ్ళమారుస్తోన్న ఓ మామూలుపాటి కార్మికుణ్ని నేను కనీసం కూడుగుడ్డల విషయంలోనయినా మా అవసరాలకి మించి ఏ ఆడంబరాలకీ వెళ్లలేనివాణ్ని వెంకటగిరి నేతచీరల్నీ కాక విదేశీ నైలాక్సుల్నీ యెల్లా కొనివ్వగలను ఆవిడకి కట్టుకోడానికి ?

కొంత వెతికి, రంగు చూసి ముమ్మూర్తులా మా బ్రతుకులా వున్న చీరనొదాన్ని పట్టుకొచ్చింది విశాల — పాత ట్రంకుపెట్టెన్ని వెదికి

దాన్ని చూస్తూనే "బలేవుంది చీర. అమ్మా! నే ఇచ్చిరానా ?" అంటూ తన చేతిలోకి తీసుకుంది బుజ్జి

"రారా నానీ! వెళ్లి ఇచ్చివొద్దాం వాళ్లకి" అంటూ అమాంతం గుమ్మంవేపు పరుగెత్తబోయింది

దానికి అడ్డుతగిలి "మనమే వెళ్లి ఇవ్వక్కర్లేదు వాళ్లకి వాళ్లే వొస్తారు ప్రతి ఇంటికీ ఇంటింటి ముందూ ఆగి, కాసేపు సన్నాయి వాయించి ఆపైన అడుగుతారు డబ్బులో, బట్టలో, ఏవయినా గింజలో!" అంటూ దాని చెయ్యిపట్టి ఆపేడు నాని

"అల్లాగే చేద్దాం" అన్నట్టుగా ఓ నవ్వు నవ్వి మడతలుపెట్టిన చీరని గుండెలకేసి హత్తుకుని వాకిట్లోంచే బయటికి చూస్తూ నుంచుంది బుజ్జి.

చిల్లరని గుప్పిట్లో బాగా బిగించి పట్టుకుని దాని పక్కనే వెళ్లి నుంచున్నాడు నాని

వీధిలో సన్నాయి వాద్యం ఆగి ఆగి వినబడుతోంది అంటే యాచనకోసం ప్రతి ఇంటి ముందూ ఆగుతూ సన్నాయి మ్రోయిస్తూ వొస్తున్నారన్నమాట — వాళ్లు!

ఒకందుకు నాకూ మా పిల్లల్ని చూస్తోంటే కడుపుని పాలతో నింపినట్టుంటుంది మనకుందా లేదా అన్న ఆలోచనలేదు వాళ్లకి ఎవరయినా తమకంటే తక్కువ స్థితిలో కష్టాల్లో వున్నట్టనిపిస్తే చాలు నేరుగా నా దగ్గరికో, వాళ్లమ్మ దగ్గరికో వొచ్చి వాళ్ల కష్టనష్టాల్ని ఏకరువుపెట్టి వున్నంతలో ఏదో ఇంత వాళ్లకి అందేలా చేస్తారు. తామే స్వయంగా తీసికెళ్లి ఇస్తారు ఆ లేత లేత మనసుల్లో -- వాళ్ల ఈడు

విలువ

పిల్లల్లో ఆమాత్రం కారుణ్యం నెలకొంటే ఇక రానున్న మానవ సమాజం శాంతి స్థావరం అవుతుందనడంలో సందేహం లేదు.

తిని మిగిలినవాళ్ళిచ్చిన ఓ తట్టెడు అన్నంకన్నా తన కడుపుగట్టి తల్లి పెట్టిన ఒకే ఒక్క గుప్పెడు మెతుకుల విలువ యెక్కువ!

నేనున్న స్థితిలో మాఆవిడ కట్టుడుచీర, నా జేబులోని రూపాయి — ఎక్కువే నాకు.

పిల్లలిద్దరూ వాకిట్లో నుంచునే యెదురు చూస్తున్నారు వాళ్లకోసం ఆశగా.

దూరంగా వినబడుతోన్న సన్నాయి సంగీతం ఆగి ఆగి, దగ్గరగా జరిగి జరిగి "అదిగో మన పక్కింటి పంతులమ్మింటి కొచ్చేరు. ఇక మనింటి కొస్తారు అల్లదిగో! వొచ్చేస్తున్నారు ఒచ్చేసేరు"

విజయపతాకం

ఓ కవితా! నా కవితా! రా!
మెల మెల్లన కాదు,
ఘలు ఘల్లున గంభీరంగా
కదనోత్సాహంతో
గాఢ దీక్ష దాహంతో రా!
నా కవితా! ఓ కవితా! రా!

ఉత్తమ శీల పరిశీలనా
యత్నంబైన చిత్తముతో
మానవతనీ నవ నవతనీ
మంచినీ వెతుకుదాం, రా!

మేలిమాడినా తూలనాడినా,
వేళాకోళాల వెక్కిరించినా,
హిరణ్యకశిపులకి నరసింహాలుగా
సోమకులకి మహా తిమింగలాలుగా
విరుచుకు పడదాం; వియత్తలంలో
ఎగరేద్దాం మన విజయ పతాకం!"

— వజ్ఝల కాళిదాసు

అని పిల్లలు సంబరపడుతోన్నంతలోనే చప్పుడు కాకుండా చల్లగా మా ఇల్లు దాటి — మా గంగిరావిచెట్టు కింది పూరిగుడిసెని దాటి—అవతల అడ్వకేటుగారింటి ముందు మ్రోగింది

నానిగాడూ బుజ్జీ, నేనూ మా ఆవిడా క్షణంసేపు నివ్వెరపోయి ఒకరి మొహాలొకరం చూసుకున్నాం.

"ఏమైంది వాళ్లకి? ఎందుకు రాలేదు మనింటికి?" ఒకరి తర్వాత ఒకరు అమాయకంగా ప్రశ్నించేరు వాళ్లమ్మవేపు నావేపూ మార్చి మార్చి చూసి

నేనూ స్తబ్దుగా నుంచున్నాను కాసేపు మనసుకేమీ పాలుపోలేదు. నానిగాడు బుజ్జీ

త్వరలో

సుదూర తీరాలు

సీరియల్

బిక్కమొహాలు మరింత సన్నవమానించినట్టని పించింది ఎందుకో

ఏదీ ఆలోచించక, కేవలం డ్రాయరుతోనే వున్నానన్న జ్ఞానమయినా లేక ఇంటి బయటికొచ్చి వీధి నుంచి మా ఇంటిని వేరుచేస్తూ నుంచునివున్న తడిక పక్కకి చేరి చూసేను వీధిలోకి

నానీ, బుజ్జీ అంతసేపూ తెగమెచ్చుకుని, అంత హంగామాచేసి చివరికి దిగులు మొహాలతో ఎదిగి నుంచోవలసిన పరిస్థితిని కల్పించిన ఆ గంగిరెద్దుల ఆటగాళ్ల బృందం తమ నాదస్వర కచేరీతో కనిపించేరు నాకు — ఎత్తయిన మా పక్కింటి మేడ ముందు!

ఒప్పున సరాసరి నా గుండెలోకే విద్యుత్తు ప్రసరించినట్టు నా మనసులోకి వొచ్చింది ఓ ఆలోచన ఆ ఆలోచనతోటే తల తిప్పి మా ఇంటి కటువేపుగా చూసేను. అది పంతులమ్మగారి రెండంతస్తుల భవంతి!

అంతే! దానితో నా ఆలోచనలోని అనుమానం నిజమనిపించింది. తల తాకట్టు పెట్టినట్టయింది ఇక అక్కడుండలేక తల వొంచుకుని తిన్నగా నడిచేను — మా ఇంట్లోకి

"నానా! వాళ్లెందుకని రాలేదు మనింటికి?" అడిగేరు ఒక్కమారే పిల్లలిద్దరూ

ఆ అర్థం వొచ్చేట్టే అల్లాంటి చూపుతోనే నా కళ్ళలోకి -- మనసులోకి - సూచ్చిచూసింది మా ఆవిడ

నేనేం చెప్పను సమాధానం ?

వెలిగే రెండు కరెంటు దీపాల మధ్య కరిగే ఓ కొవ్వొత్తి తాలూకు కాంతిపూరాన్ని యెవ్వరూ కోరుకోరని చెప్పనా ?

నిటారుగా నింగిలోకి లేచిన రెండు మేడల మధ్య నేలలోకి నిలువునా కూరుకుపోయే మా పూరిపాక విలువ తెలిపోయిందని చెప్పనా ?

ఏం చెప్పను ? పైపై మెరుగులు చూసే కళ్లకి మాలో, మా ఇంట్లో ఏ విలువ కొరవడిందని ఆ చిన్నారి మనసులకి నచ్చజెప్పను ?

అందుకే నోట మాట రాక, మనసుండబట్టక ఆ మానె అంటిన చేతివేళ్లతోనే నా కళ్ల తడిని తుడుచుకున్నాను మౌనంగా — తల వొంచుకుని ★